సామాజిక దవాఖానలో విద్యార్థులను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

గురుకులానికి జ్వరం

- మంచం పట్టిన సిర్పూర్(టీ) బాలుర పాఠశాల విద్యార్థులు
- స్థానిక సామాజిక దవాఖానకు తరలింపు.. బెడ్లు సరిపోక తిప్పలు
- పాఠశాల నుంచి తీసుకొచ్చిన వాటిపై చికిత్స
- పరిశీలించిన అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఎంహెచ్‌వో

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 9 : సిర్పూర్(టీ) మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల-కళాశాల జ్వరాలతో మంచం పట్టింది. రెండు రోజుల్లో దాదాపు 35 మంది విద్యార్థులు జ్వరం బారిన పడ్డారు. ఆదివారం 23 మంది విద్యార్థులకు ఒకేసారి జ్వరం రాగా, ప్రిన్సిపాల్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులను వెంటనే సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించారు. అక్కడ సరిపడా బెడ్లు లేకపోవడంతో తిప్పలు పడాల్సి వచ్చింది. వెంటనే గురుకుల పాఠశాల నుంచి 10 డబుల్ బెడ్లను దవాఖానకు తీసుకొచ్చారు. అనంతరం ఆ బెడ్లపై విద్యార్థులకు చికిత్స అందించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎంఅండ్ హెచ్‌వో అక్కడే ఉండి మెరుగైన వైద్య సేవలందేలా చూశారు. అదేరాత్రి మరో ముగ్గురు విద్యార్థులకు కూడా జ్వరం రావడంతో అప్పటికప్పుడు దవాఖానకు తరలించారు. సోమవారం కూడా మరో 8 మంది విద్యార్థులకు జ్వరం రావడంతో హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఆపై దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. గురుకులంలో ఎంత మందికి జ్వరం వచ్చిందో రిపోర్టు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం చికిత్స తీసుకున్న 26 మంది విద్యార్థుల్లో.. 16 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా, ఇంటికి తీసుకెళ్లారు. అదనపు కలెక్టర్ వెంట డీఎల్‌పీవో, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, మెడికల్ అధికారులు డాక్టర్ నవత, అనూష ఉన్నారు. కాగా, దాదాపు 34 మంది విద్యార్థులకు జ్వరాలు వచ్చినట్లు పాఠశాల, వైద్య సిబ్బంది చెబుతుండగా, అనధికారికంగా దాదాపు 100 మందికిపైగా విద్యార్థులకు జ్వరాలు వచ్చినట్లు తెలుస్తున్నది.

నిబంధనలు పాటించాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 9 : గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చింతపండువాడలోని సిద్ధివినాయక, ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను ఆదివారం రాత్రి మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి సందర్శించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యలుంటే డయల్ 100కు సమాచారమివ్వాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జన శోభాయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. బందోబస్తు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని, మండపం వద్ద ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌లను చెక్ చేయాలని సూచించారు. టౌన్ సీఐ బన్సీలాల్ ఉన్నారు.

నిర్వాహకులతో మాట్లాడుతున్న సీపీ, డీసీపీ, ఏసీపీ

సంక్షేమ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 9 : అభివృద్ధి, సంక్షేమ పథకాల లక్ష్యాలను సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌ను నియమించినందున.. అక్కడే జరిగే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మంచినీటి బావులు, నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. విషజ్వరాల నియంత్రణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

నెన్నెలలో కూలిన ఇల్లు

బెజ్జూర్ : ఉధృతంగా ప్రవహిస్తున్న కుకుడ ఒర్రె

నెన్నెల : లంబాడీతండా వాగును పరిశీలిస్తున్న అధికారులు

తూర్పున దంచికొట్టిన వాన

- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో జోరుగా వర్షం
- వాగులు.. వంకలు ఉప్పొంగి నిలిచిన రాకపోకలు
- ప్రాణహిత, గోదావరి పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నెన్నెలలో కూలిన ఇల్లు.. వృద్ధ దంపతులకు తప్పిన ప్రమాదం
- ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

మంచిర్యాల, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తూర్పు జిల్లాలైన మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్‌లలో వర్షం దంచి కొట్టింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేకుండా వాన పడింది. భారీ వర్షాలకు ప్రాణహిత, గోదావరి నదులతో పాటు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూరులో 44.5 మిల్లీమీటర్లు, కోటపల్లిలో 41.5, వేమనపల్లి మండలం నీల్వాయిలో 27.0, చెన్నూర్‌లో 24.5, భీమారంలో 22.3, కన్నెపల్లిలో 22.5, భీమినిలో 20.5, చెన్నూర్ మండలం కొమ్మెరలో 20, నెన్నెలలో 19.3, కాసిపేట మండలం కొండాపూర్‌లో 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 33.0 మిల్లీమీటర్లు, పెంచికల్‌పేట మండలం ఎల్కపల్లిలో 26.3, దహెగాం మండలం కొంచవెల్లిలో 20.8, దహెగాంలో 20.0, రెబ్బెన మండలం వంకులంలో 20.5, చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో 17, కౌటాలలో 16.8 మీల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. బెజ్జూర్ నుంచి సోమిని మార్గంలోని వాంగులు ఉప్పొంగడంతో సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆసిఫాబాద్ మండలం రౌట సంకెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రౌట గ్రామానికి సమీపంలోని ఉట్ల వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి కోటపల్లి మండలంలోని ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలను పర్యటించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణ-మహారాష్ట్రలకు నాటు పడవల ద్వారా రాకపోకలను నిలిపివేయడంతో పాటు నదుల్లోకి చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. జిల్లాలో రోడ్డు సౌకర్యం లేని గ్రామాలతో పాటు ముంపు గ్రామాల్లోని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. చెన్నూర్ పట్టణంలోని పెద్ద చెరువు, కుమ్మరి కుంట మినీ ట్యాంకు బండ్లు పూర్తిగా నిండాయి. నెన్నెల మండల కేంద్రంలోని వడ్లవాడకు చెందిన దురిసెట్టి మల్లయ్య ఇల్లు కూలింది. ఆ సమయంలో వృద్ధ దంపతులు ఇంటి ముందున్న గుడిసెలో ఉండడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దామోదర్‌రెడ్డి, ఎస్ఐ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్ వాగును పరిశీలించారు. ఆయాచోట్ల అత్యధిక వర్షం పడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

బెజ్జూర్ : నిండుగా ప్రవహిస్తున్న కుకుడ వాగు

శ్రీరాంపూర్ ఓసీపీపై ప్రభావం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 9 : కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీరాంపూర్ ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జూలైలో 10 రోజులు, ఆగస్టులో 15 రోజులు, ఈ నెలలో 5 రోజుల వర్షాలతో ఉత్పత్తికి విఘాతం కలిగింది. రోజుకు 10 వేల టన్నులతో 3 లక్షల టన్నుల బొగ్గు నష్టపోవాల్సి వచ్చింది. ఇందారం ఓసీపీలో రోజుకు 3600 టన్నులు బొగ్గు ఉత్పత్తికి నష్టం జరుగుతుంది. సింగరేణి ఓసీపీ(ఉపరితల) గనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇక సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు పడుతుండగా, 20 ఓసీపీల్లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతున్నది. ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థలకు అప్పగించిన మట్టి తవ్వకాలు, రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు వెనకబడిపోయాయి. సింగరేణి ఉపరితలంలో నిల్వ ఉన్న బొగ్గును విద్యుత్ పరిశ్రమలకు రవాణా చేస్తున్నారు. ఓసీపీ క్వారీలో వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. యాజమాన్యం ఎప్పటికప్పుడు మోటార్ పంపుల ద్వారా ఉపరితలానికి నీటిని తరలిస్తున్నారు. వర్షాలతో ఓసీపీల్లో పని చేస్తున్న కార్మికులు యంత్రాల మెయింటనెన్స్, ఉపరితలంలోని బంకర్లను రిపేరు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- మంచిర్యాల ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కోటపల్లి, చెన్నూర్‌లో పర్యటన

కోటపల్లి, సెప్టెంబర్ 9 : సీజనల్ వ్యాధ్యులపై అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కోటపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఓపీ, మండల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేయాలని, అవసరమున్న చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతిరోజూ కొనసాగించాలని, విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ఆలుగామ గ్రామానికి వెళ్లి చెత్త పేరుకుపోయి ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించారు. జ్వర సర్వే గురించి ఆరా తీశారు. గ్రామంలో జ్వర సర్వే జరిగిందని పంచాయతీ కార్యదర్శి చెప్పగా, గ్రామస్తులు జరగలేదని చెప్పడంపై కలెక్టర్ మండిపడ్డారు. వర్షాలు కురుస్తున్నందున ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ మహేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

చెన్నూర్, సెప్టెంబర్ 9: ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెన్నూర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తహసీల్దార్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి

కోటపల్లి పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతూ..

జైనూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసు పహారాలో జైనూర్

- కొనసాగుతున్న ఆంక్షలు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు
- విధ్వంసంపై పోలీసులకు 120 ఫిర్యాదులు..?
- అదుపులో మరో ఐదుగురు..!

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/జైనూర్, సెప్టెంబరు 9 : జైనూర్‌లో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలీసుల పహారా ఇంకా కొనసాగుతున్నది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. జైనూర్‌లోకి ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. సోమవారం కూడా ఆంక్షలు విధించారు. ఇక్కడ జరిగిన విధ్వంసంపై పోలీసులకు సుమారు 120 ఫిర్యాదులు అందినట్లు సమాచారముండగా, అందులో దాదాపు 200 మంది పేర్లు ఉన్నట్లు తెలుస్తున్నది. సోషల్ మీడియాల్లో వచ్చిన వివిధ వీడియోలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పోలీసులు ఇప్పటికే 13 మందిపై కేసులు నమోదు చేయగా, సోమవారం మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆరు రోజులుగా స్థానిక మార్కెట్‌ను బంద్ చేయడంతో ప్రజలు నిత్యావసరాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఉట్నూర్, హస్నాపూర్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నారు. జైనూర్, కెరమెరి, తిర్యాణి, వాంకిడి మండలాల్లో ఇంకా నెట్ సేవలు ప్రారంభం కాలేదు. సోమవారం కెరమెరి మండలంలోని వ్యాపారస్తులు, ఆదివాసీలు సామరస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్‌ను తెరిచే అంశంపై చర్చించుకున్నారు. ఆదివాసీలు, ఇతర వర్గాల వారు వ్యాపారస్తులకు ఎలాంటి నష్టం చేయకూడదని ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. మార్కెట్ బంద్ ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరినట్లు సమాచారం. ముఖ్యంగా రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకునేందుకు, పెన్షన్‌లు పొందేందుకు నెట్ లేకపోవడం వల్ల ఆదివాసీలు, సాధారణ ప్రజలకు కూడా ఇబ్బందులు పడుతున్నారని, నెట్ సేవలను పునరుద్ధరించాలని కోరినట్లు సమాచారం. జైనూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు పోలీసులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పత్తి చేల నడుమ గంజాయి సాగు

- ఏజెన్సీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పెంపకం
- పోలీసుల ప్రత్యేక నిఘా.. తనిఖీలు
- ఇటీవల పలుచోట్ల పట్టివేత
- పల్లెల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు
- యువత పెడదారి పట్టకుండా చర్యలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : మారుమూల పల్లెల్లో జోరుగా గంజాయి సాగవుతున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల కెరమెరి మండలం దేవుడుపల్లిలో పోలీసులు తనిఖీలు చేయగా, తాక్సాండే పోచిరాం పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. కొందరు గుట్టుచప్పుడు కాకుండా దందా సాగిస్తున్నట్లు సమాచారముండగా, పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదం మోపే లక్ష్యంతో ముందుకెళ్తున్నది.

ఇటీవల పలుచోట్ల పట్టివేత

కొద్ది రోజులుగా పోలీసులు తనిఖీలు చేపడుతుండగా, పెద్దమొత్తంలో గంజాయి పట్టుబడుతున్నది. జైనూర్ మండలం గౌరీ పంచాయతీ పరిధిలోని కొలాంగూడకు చెందిన ఆత్రం భీంరావు ఇంటి వద్ద తనిఖీలు చేయగా, 3 కిలోల ఎండబెట్టిన గంజాయి దొరికింది. అలాగే సిర్పూర్-యు మండలంలో నలుగురి వద్ద 700 గ్రాముల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. మోటర్ సైకిల్‌పై పాముల వాడ గ్రామం నుంచి సిర్పూర్-యు వైపు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జైనూర్ మండల కేంద్రంలోని కాలేజీగూడ దగ్గర చేపట్టిన వాహనాల తనిఖీల్లో జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఇండికా కారును ఆపి తనిఖీ చేయగా, అందులో 1.5 కిలోల గంజాయి లభించింది. రెండేళ్లక్రితం వాంకిడి మండలం లెండిగూడలోని ఓ చేనులో 75 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిర్యాణి మండలం ఎర్రబండలో 400 గంజాయి మొక్కలు, సిర్పూర్-యులో 550 మొక్కలు, ఆసిఫాబాద్ మండలం తుంపల్లిలో 40 మొక్కలు, కాగజ్‌నగర్‌లో 14 మొక్కలు, జైనూర్‌లో 100 మొక్కలు ధ్వంసం చేశారు.

కెరమెరి : ఇటీవల దేవుడుపల్లిలోని పత్తి చేనులో సాగుచేస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు

ఇటీవల గౌరీ గ్రామంలో పట్టుబడ్డ గంజాయి

పోలీసుల ఉక్కుపాదం..

జిల్లాలో గంజాయి సాగును అరికట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గతంలో గుట్టలను ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో తనిఖీలు చేపట్టి గంజాయి సాగును అడ్డుకున్నారు. గంజాయి రవాణా, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. గంజాయిని సాగుచేసేలా ప్రలోభాలు పెట్టేవారిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మళ్లీ మారుమూల ప్రాంతాల్లో గంజాయి పట్టుబడుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి సాగుపై పక్కాసమాచారాన్ని సేకరిస్తూ తనిఖీలు చేపడుతున్నారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. యువత పెడదారి పట్టకుండా చైతన్యపరుస్తున్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు